క్లుప్తంగా

నేడు వాహనాల బహిరంగ వేలం

దేవరపల్లి: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ డి.సుధ తెలిపారు. ఎనిమిది వాహనాలను బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్సు కాపీతో పాటు రూ.5,000 ధరావత్తు చెల్లించాలని ఆమె తెలిపారు. పాటలో వాహనాలను దక్కించుకున్న వారు అదే రోజు వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ చెల్లించాలని ఆమె తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

చాగల్లు: మార్కొండపాడు గ్రామంలో రూ.17.5 లక్షల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు గురువారం ఎంపీపీ మట్టా వీరాస్వామి భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో ఇందిరానగర్ కాలనీలో రోడ్లు, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.2.5 లక్షలతో జెడ్పీహైస్కూల్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వీటి నిర్మాణాలకు భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంగిశెట్టి వాసు, సర్పంచ్ కె.పాశి శివపార్వతి, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొర్రా వెంకట్రావు, శ్రీకాకుళ పు శివ, బద్దా పాతిరాజు, కప్పల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3.04 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి హుండీలను గురువారం అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో తెరిచి లెక్కించినట్టు ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు. 41 రోజులకు సంబంధించి ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాల హుండీలా ద్వారా రూ.3,04,739 ఆదాయం వచ్చిందని, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని తెలిపారు. హుండీ ద్వారా లభించిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ ఇన్‌స్పెక్టర్ ఎం.వరప్రసాద్, పంతం చిన్న, పులపర్తి నాగరాజు, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు, గుత్తుల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారుకొండ కిట్ల పంపిణీ

నిడదవోలు రూరల్: చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు బంగారుకొండ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. తిమ్మరాజుపాలెంలో పల్లారావు చిన్నారుల తల్లులకు బంగారుకొండ కిట్లు గురువారం అందజేశారు. సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఉపసర్పంచ్ కీర్తి శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే



అనంతపల్లిలో సర్వేను పర్యవేక్షిస్తున్న సంధ్య

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ సంధ్యా అన్నారు. ఈ కార్యక్రమంపై వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం అనంతపల్లిలో ఆమె సర్వేను పర్యవేక్షించారు. అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ సంధ్యా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఏమైనా సమస్యలుంటే యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆమెతో పాటు పీహెచ్‌ఎస్ ఇందిర, హెచ్‌వీ మీరాభాయ్, ఏఎన్‌ఎంలు దీప్తి, గౌతమి, ఎం, ఎల్‌హెచ్‌పీ శ్యాం, సంధ్య, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన బొద్దులూరి సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోపీనాథ్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నిరాహార దీక్షకు మద్దతు

కొవ్వూరు: చంద్రబాబు అరెస్టుకి నిరసనగా వాడపల్లిలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ముగ్గురు టీడీపీ నాయకులను మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమారుడు, చంద్రబాబు బావమరిది రామకృష్ణ గురువారం పరామర్శించారు. ఇదే శిబిరంలో రిలే దీక్షలు చేస్తున్న ఇతర నాయకులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ కన్వీనర్ కూడిపూడి సత్తిబాబు, జనసేన నాయకుడు పీకే రంగారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. నూతన ఒరవడి..

- ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన
- ఇప్పటికే చేరిన ఐఎఫ్‌పీ టీవీలు
- విద్యార్థుల్లో చదువుపై పెరుగుతున్న ఆసక్తి



గోపాలపురం జెడ్పీ హైస్కూల్‌లో టీవీతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయిని

గోపాలపురం: పిల్లలకు ఓ విషయాన్ని చెప్పినప్పుడు పూర్తిగా గుర్తుపెట్టుకోలేరు. అదే టీవీలో చూపిస్తూ చెప్పడం వల్ల దాదాపు అంతా గుర్తుపెట్టుకునే అవకాశం ఉంది. ఇదే అంశంగా తీసుకొని ప్రభుత్వం పాఠశాలల్లో సాంకేతిక విద్యను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం సర్కారు బడులు అత్యాధునిక టెక్నాలజీతో ఆధునిక విద్యాబోధనతో ముందుకు సాగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులు కల్పించడంతో పిల్లలు విద్యపై ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు దృష్టి సారిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30లక్షల విలువైన ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్లానల్ ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య శ్రవణం ద్వారా విద్యాబోధనలు చేస్తున్నారు. గోపాలపురం మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీ టీవీలు 55 అందజేశారు. 13 ఎంపీయూపీ పాఠశాలలకు 22 స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు. ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్లానల్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యతోపాటు ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థి ముందుకు సాగేందుకు దోహదపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎంతో విజ్ఞానం సాధించే అవకాశాలు ఉంటాయి. వారు జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు సర్కారు పలు పథకాలను అమలు చేస్తోంది.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్లానల్ టీవీలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు సులభంగా, అర్థమయ్యేలా బోధన ఎలా చేయాలో ఇప్పటికే శిక్షణను పూర్తి చేశాం. ఆయా పాఠశాలల పరిధిలో క్లాస్‌లు కూడా ఆరంభమయ్యాయి. టీవీలు చూసి చదవడం వల్ల ఎక్కువ శాతం గుర్తుంటుంది. అది పరీక్షలు బాగా రాసేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థి భవిష్యత్తు పునాది పడుతుంది. ఆధునిక విద్య వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయి వార్తలతో పాటు ఉన్నత విద్యకు అవకాశాలను తెలుసుకునే అవకాశం ఉంది.

– జి.శ్రీనివాసరావు ఎంఈఓ, గోపాలపురం మండలం

సులభంగా అర్థమయ్యేలా



ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్లానల్ టీవీల వల్ల విద్యాబోధనల సులభంగా అర్థమవుతుంది. దృశ్య, శ్రవణం చేయడం వల్ల సాంకేతిక విద్యతోపాటు ప్లానల్‌లో ఎన్నో రకాల వింతలు విశేషాలు చూస్తున్నాం. అవి అర్థం చేసుకుంటున్నాం. ఎక్కువ గుర్తుంటున్నాయి. దీని వల్ల చదువుపై మరింత ఆసక్తి పెరిగింది. డగలరు, విని అర్థం చేసుకుంటారు.

–పేరుబోయిన శాంతి, విద్యార్థి, పదో తరగతి

ఎంతో విజ్ఞానం



ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్లానల్ టీవీల వల్ల విద్యార్థులు త్వరగా అర్థం చేసుకుంటున్నారు. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. విద్యా బోధన సులభతరమైంది. ఈ విద్య విద్యార్థులకు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు.

– కె.రత్నరాజు ఉపాధ్యాయుడు గోపాలపురం జెడ్పీ హైస్కూల్

పంచకర్మ చికిత్స విధానం ప్రారంభం



పంచకర్మ చికిత్స విధానాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: స్థానిక గాంధీనగర్‌లోని ఆయుర్వేద ఆసుపత్రిలో రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ చైర్మన్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పంచకర్మ చికిత్స విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ సనాతన ఆయుర్వేద వైద్య విధానంలో పంచకర్మ వైద్యం ఎంతదో కీలకమైందన్నారు. ఈ చికిత్సను నిడదవోలు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యాక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివారావు, ఆయుష్ శాఖ ప్రభుత్వ వైద్యులు కొల్లిపర శ్రీవిద్య, క్లబ్ కార్యదర్శి గుంటిపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, మెడికల్ సర్వీస్ డైరెక్టర్ చిక్కాల రాజా, గొన్నబత్తుల రామారావు, ముంగడి చిట్టిబాబు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుందరి

నల్లజర్ల: పోషక విలువలు ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారానే తల్లీ, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ వై.బి.సుందరి సూచించారు. తెలికిచెర్లలో గురువారం పోషకాహారంపై తల్లులు, గర్భిణులలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారుల్లో ఎదుగుదల, బరువు తగ్గడం, రక్త హీనత లోపాలను నివారించేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో సమతుల్య ఆహారం అందిస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో ఉండే పోషక విలువలను ప్రదర్శన ద్వారా వివరించారు. శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలే పట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్కా పండు, అడిషనల్ సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ ఎస్.వి.కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశకార్యకకర్తలు, గ్రామ మహిళా సంరక్షణాధికారులు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో...

పెరవలి: అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే రేషన్ సరకులతోపాటు పౌష్టికాహారం గురించి తల్లులకు, గర్భిణులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని సూపర్‌వైజర్ వనజాక్షి తెలిపారు. మల్లేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో పిట్టల వేమవరం, కడింపాడు, అన్నవరప్పాడు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో కలసి పౌష్టికాహార వారోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల అంగన్‌వాడీ టీ చర్లు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను గురువారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

- తాడిపూడి ప్రధాన కాలువపై దేవరపల్లి, గోపాలపురం మండలాల పరిధిలో మూడు సబ్‌లిఫ్టులు ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గోపాలపురం వద్ద 2వ సబ్‌లిఫ్టు, దేవరపల్లి వద్ద మూడో సబ్‌లిఫ్టు, బందపురం వద్ద ఐదో సబ్‌లిఫ్టు ఉన్నాయని, 2, 3 సబ్‌లిఫ్టుల ద్వారా ఏటా ఖరీఫ్‌లో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.
- బందపురం వద్ద ఐదో సబ్‌లిఫ్టు పనులు పూర్తికాకపోవడంతో సుమారు 12 వేల ఎకరాలు నిరూపయోగంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. 2009లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 5వ సబ్‌లిఫ్టుకు రూ.54 కోట్లు మంజూరు చేయగా, లిఫ్టు నిర్మాణం చేసి, కాలువ తవ్వకానికి 200 ఎకరాలను రైతుల నుంచి సేకరించి, పరిహారం అందించినట్టు ఆయన తెలిపారు.
- సబ్‌లిఫ్టు మెయిన్ కెనాల్ పనులు పూర్తి చేసి, పంట కాలువలను ఏర్పాటు చేస్తే మెట్ట ప్రాంతంలోని గోపాలపురం, దేవరపల్లి, కొయ్యలగూడెం మండలాల్లోని 12 వేల ఎకరాలకు సాగులోకి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.
- కొవ్వాడ కాలువ వల్ల ప్రతి సంవత్సరం వర్షాకాలంలో దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, గోపాలపురం మండలంలోని చెరుకుమిల్లి, చిట్యాల, వెంకటకాయపాలెం గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల పంట ముంపుకు గురవుతుందని, ప్రతి ఆరు నెలలకు రైతులకు రూ.3 నుంచి 5 కోట్లు పంట నష్టపరిహారం ప్రభుత్వం అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. కాలువ పూడిక తీసి ఆధునీకరణ చేస్తే ముంపు నుంచి పంటలను కాపాడవచ్చునని ఆయన తెలిపారు.
- ద్వారకాతిరుమలలోని చిన్నవెంకన్న స్వామివారి దేవస్థానానికి కాలినడక భక్తులు ఎక్కువ వెళుతున్నారని, దూబచర్ల నుంచి ద్వారకాతిరుమల రోడ్డు అధ్వానంగా ఉన్నందున భక్తులు ఇబ్బంది పడుతున్నట్టు ఆయన ప్రస్తావించారు. గోపాలపురం నుంచి దొండపూడి(9 కిలో మీటర్లు) ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా పాడైపోయిందని, రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.
- గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం మంజూరే చేసిన సీఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తాం



సభలో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

కొవ్వూరు: దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తుందని చైర్మన్ ముదునూరి సూర్యనారాయణరాజు పేర్కొన్నారు. గురువారం దొమ్మేరులో పీఏసీఎస్ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను సొసైటీ ద్వారా అందిస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన అన్నీ రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రైతులకు 12 శాతం డివిడెంట్‌ను అందిస్తున్నామని తెలిపారు. త్రిమెన్ కమిటీలో సభ్యులుగా నియమితులైన పేరిచర్ల సుబ్బరాజు, ఈదర సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. నాయకులు బొల్లిన సతీష్, పేరిచర్ల సత్యనారాయణ రాజు(బోసురాజు), వాడవెల్లి చక్రధరరావు, ముదునూరి సుబ్బరాజు, పెండ్యాల రమణ, మద్దుల వీర్రాజు, సొసైటీ కార్యదర్శి కరిబండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ వేగవంతం చేయాలి

పంచాయతీ సభ్యుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న పంచాయతీ సభ్యులు

దేవరపల్లి: స్థానిక పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ వేగవంతం చేయాలని పంచాయతీ సభ్యులు కై రం అప్పారావు(4వ వార్డు), తంగెళ్ల సుబ్రహ్మణ్యం(13వ వార్డు), చిడిపి వెంకటేశ్వరి(1వ వార్డు) సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం దేవరపల్లిలో వారు విలేకర్లతో మాట్లాడారు. గతంలో ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీలో రూ.70 లక్షల నిధులు దుర్వినియోగం జరిగాయని, విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని సభ్యులు తెలిపారు. దీనిపై ఏడాది క్రితం ముగ్గురు పంచాయతీ కార్యదర్శులతో కమిటీని వేసి విచారణకు ఆదేశించారని, ఆ కమిటీ ఏమైయిందో ఇప్పటి తెలియడంలేదని సభ్యుడు కైరం అప్పారావు తెలిపారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. లోకాయుక్త ఆదేశాల మేరకు ఇటీవల అధికారులు విచారణ చేపట్టగా సుమారు రూ.57 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు విచారణలో తేలినట్టు తెలిసిందన్నారు. నివేదిక లోకాయుక్తకు ఇవ్వకుండా దొంగ బిల్లులు పెట్టి నివేదికను తారుమారు చేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు వాస్తవ నివేదికను లోకాయుక్తకు అందజేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విచారణ సక్రమంగా జరగకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నిడదవోలు రూరల్: మండల పరిధిలోని వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఏడు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ గురువారం తెలిపారు. సమిశ్రగూడెం సచివాలయ-1 పరిధిలో (సీ5- జనరల్), (సీ13- బీసీ), (సీ14-ఎస్సీ), (సీ21-జనరల్), సచివాలయ-2 పరిధిలో (సీ15- ఎస్సీ), పెండ్యాల(సీ8-ఎస్సీ), తాడిమళ్ల (సీ15-జనరల్) పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలతో యువతలో చైతన్యం



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము

నిడదవోలు: సేవా కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం, సామాజిక స్పృహను కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము అన్నారు. స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో గురువారం గారపాటి ప్రసన్న కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాము మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ చదువుకునే అవకాశాలతోపాటు అర్హులందరికీ ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని కోరారు. యువతకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలన్నారు. భవితను నిర్వీర్యం చేసే గంజాయి, డ్రగ్స్‌ని అరికట్టాలన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు డీవైఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కె. నరసింహ, ఆర్ అజయ్, ఎండీ అబ్దుల్లా, ఎ.ఫణికుమార్, షాను, ర్యాలీ ఆనంద్, విక్రమ్ జైన్, ఎం.వికిత్, కె.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

తాళ్లపూడి: గ్రామానికి చెందిన ఎలుబోలు శ్రీకృష్ణ భగవాన్ ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఆ బాధిత కుటుంబ సభ్యులకు గురువారం పంచాయతీ కార్యదర్శి ఆశాఅలేఖ్య అందజేసారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ జి.గణేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్ స్వాతిలక్ష్మి ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ద్వారకాతిరుమల: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి, జీతాలను పెంచాలని కోరుతూ నియోజకవర్గం లోని నాలుగు మండలాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన తాము ఈ వినతిపత్రాన్ని అందజేసినట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే తలారి సానుకూలంగా స్పందించారని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వసంతాటి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

కొవ్వూరు: సారాలో కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను గురువారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన జానా విష్ణు, చిక్కాలపాలెం గ్రామానికి చెందిన పిల్లి ప్రేమ్‌కుమార్, ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామానికి చెందిన కర్రి శ్రీమన్నారాయణలను అరెస్టు చేసి నిడదవోలు, కొవ్వూరు కోర్టుల్లో హాజరు పరిచినట్టు తెలిపారు.

పత్రికా ప్రకటన

[illegible]

కొవ్వూరు,
ది.19.09.2023

B.A., B.L. అడ్వకేట్

బైబై గణేశా



బ్రాహ్మణగూడెంలో వినాయక విగ్రహ ఊరేగింపు



ముక్కామలలో వినాయక ఊరేగింపు

చాగల్లు: మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కాలనీలో, బీసీ కాలనీలో, ఎస్ ముప్పవరంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, యువకులు పాల్గొన్నారు. చాగల్లు, మార్కొండపాడు, చిక్కాల గ్రామాల్లో స్వామివారిని బుట్టబొమ్మలు, డప్పు వాయిద్యాలతో స్వామివారిని గ్రామంలో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.

చాగంటికి సత్కారం: నవరాత్రి వేడుకల్లో వర్తక సంఘం కళావేదిక వద్ద పురాణ ప్రవచకులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు అందించిన పురణ ప్రవచన సందేశం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రంధి రాంబాబు తదితరులు ఉన్నారు.

నిడదవోలు : పట్టణంలో గణేష్ చౌక్ సెంటర్లోని శ్రీ పూజా గణపతి కుమారస్వామి వారి ఆలయం వద్ద 101వ గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్ రెస్టారెంట్ మాజమాన్యం సహకారంతో బుధవారం రాత్రి నిర్వహించిన రాక్‌స్టార్ సినీ మ్యూజికల్ నట్ శ్రోతలను అలరించింది.



మ్యూజికల్ నైట్‌లో గీతాలు ఆలపిస్తున్న కళాకారులు



శ్రీకృష్ణరాయబారం నాటకంలో ఓ సన్నివేశం

పెరవలి: వినాయక చవితి సందర్భంగా ముక్కామల గ్రామంలో వినాయక ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. యువత కేరింతలు కొడుతూ గ్రామోత్సవం అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

చాగల్లు: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చాగల్లులో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చాగల్లులో తెలగా సంఘం గండ్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలో పౌరాణిక ఆణిముత్యాలు ప్రదర్శించారు. అందులో భాగంగా శ్రీకృష్ణ తులాభారం, శ్రీకృష్ణ రాయభారం, రామాంజనేయ యుద్ధం, భక్త చింతామణి ప్రదర్శించారు.